ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 1 ఆగస్టు 2025

వరినారు కాపాడుకోవడానికి అన్నదాతల పాట్లు

మాకవరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి తీక్షణంగా కాస్తున్న ఎండలకు వరి నారు మడులు ఎండుతున్నాయి. నారును కాపాడుకోవడానికి రైతులు నానాపాట్లు పడుతున్నారు. సుమారు నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు ఆకుమడులు పోశారు. తరువాత అడపాదడపా వర్షాలు కురవడంతో నారు ఆశాజనంగా పెరుతున్నది. అయితే వారం నుంచి వర్షాలు పడకపోగా, ఎండలు మండిపోతుండడంతో నారు ఎండిపోతున్నది. పలువురు రైతులు ఇంజన్లతో గెడ్డలు, బావుల్లో నీటిని తోడిపోసి వరి నారును బతికించుకుంటున్నారు. ఇంజన్లు లేని రైతులు నేల బావుల నుంచి బిందెలతో నీటిని తెచ్చి నారుమళ్లను తడుపుకోవాల్సి వస్తున్నది. రానున్న వారం, పది రోజుల్లో వర్షాలు పడకపోతే వరినాట్లు వేయడం కష్టమేనని రైతులు అంటున్నారు.



మాకవరపాలెంలో నేల బావి నుంచి నీటిని తెచ్చి వరినారుమడిపై చల్లుతున్న మహిళా రైతు

ఉత్తరాంధ్ర అంటే ఎంతో ఇష్టం

త్వరలో ఇక్కడ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం

- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు
- అనకాపల్లిలో కార్యకర్తలతో సమావేశం
- హాజరైన ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసైనికులు



నాగబాబుకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



సమావేశానికి హాజరైన జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు

కొత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అంటే ఎంతో ఇష్టమని, వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యుడు కొణిదెల నాగబాబు అన్నారు. గురువారం అనకాపల్లి విచ్చేసిన ఆయన సత్యా గ్రాండ్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో ఉన్న నాయకులు, ప్రజలు అంటే ఎంతో గౌరవమని, అతి త్వరలోనే ఈ ప్రాంతంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ... మిగతా 8వ పేజీలో

పాఠశాల క్రీడా స్థలం కబ్జా

మామిడిపాలెంలో దర్జాగా పక్కా ఇళ్ల నిర్మాణం

- స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



మామిడిపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలానికి కేటాయించిన భూమి

తుమ్మపాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి మండలం మామిడిపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆట స్థలం ఆక్రమణలకు గురవుతున్నది. కొంతమంది అక్రమార్కులు పాఠశాల క్రీడా మైదానాన్ని కబ్జా చేసి, దర్జాగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.**

మామిడిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 145లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆట స్థలం కోసం 20 ఏళ్ల క్రితం అధికారులు కేటాయించారు. అయితే విద్యా శాఖకుగానీ, జిల్లా పరిషత్‌కుగానీ డాక్యుమెంటేషన్ రూపంలో బదలాయింపు జరగలేదు. విద్యా శాఖ అధికారులు సైతం ఈ స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు 2018లో మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం ఈ స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు అప్పటి ఉమ్మడి విశాక జిల్లా కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. నిధులు మంజూరైతే భవన నిర్మాణాలు ... మిగతా 8వ పేజీలో



పాఠశాల ఆట స్థలంలో చేపట్టిన ఇంటి నిర్మాణం

కారిడార్ నిర్వాసితులకు ప్యాకేజీ

ఒక్కో కుటుంబానికి ఐదు సెంట్ల స్థలం



నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపు కోసం లాటరీ తీస్తున్న ఆర్డీవో రమణ

- ఇంటి నిర్మాణానికి రూ.8.98 లక్షలు
- పెదబోదిగల్లం సమీపాన 151 ఎకరాల్లో లేఅవుట్
- లాటరీ ద్వారా స్థలాల కేటాయింపు
- ఇంటి నిర్మాణ సాయం రూ.25 లక్షలకు పెంచాలని వైసీపీ, సీపీఎం డిమాండ్
- కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్న ఆర్డీవో రమణ

నక్కపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై రెవెన్యూ అధికారులు గురువారం మండలంలోని అమలాపురం శివారు పాటిమీద గ్రామంలో సభ నిర్వహించారు. బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్‌పురం, రాజయ్యపేట, వేంపాడు రెవెన్యూ గ్రామాలకు చెందిన నిర్వాసితులకు పెదబోదిగల్లం సమీపాన సుమారు 151 ఎకరాల్లో వేసిన లేఅవుట్‌లో డ్రా ప్రక్రియ ద్వారా స్థలాలు కేటాయించారు. ఈ సభకు నిర్వాసితులతోపాటు వైసీపీ, సీపీఎం నేతలు వచ్చారు. నిర్వాసితులకు ఐదు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.8.98 లక్షల ప్యాకేజీ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ తదితరులు అన్నారు. ఇంటి నిర్మాణ సాయాన్ని రూ.25 లక్షలకు పెంచాలని, అంతవరకు గ్రామాలను ఖాళీ చేసేది లేదని స్పష్టం చేశారు. నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ స్పందిస్తూ.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ, సీపీఎం నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలిలో దాహం కేకలు

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

యర్రవరం సంప్ వద్ద పాడైన మోటారు



క్లబ్ రోడ్డులో కొళాయి నుంచి అరకొరగా వస్తున్న నీరు

- ప్రధాన పైప్‌లైన్ నుంచి పొలాలకు నీటిని మళ్లించిన రైతులు
- ఈ సమస్యలను పరిష్కరించినా.. మెరుగుపడని నీటి సరఫరా
- తాజాగా పోలిమేరమ్మ తల్లి ఆలయం వద్ద ధ్వంసమైన ప్రధాన పైపులైన్
- మరమ్మతులు చేయిస్తున్న అధికారులు
- నేడు కూడా అరకొరగానే నీటి సరఫరా

ఎలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): **మునిసిపాలిటీలో కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాల అస్తవ్యస్తంగా తయారైంది. యర్రవరం సంప్ వద్ద ఒక మోటారు పాడైపోవడం, దీనికి మరమ్మతులు చేసే సరికి వరహా నది నుంచి నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ దెబ్బతిన్నది. దీంతో మూడు రోజుల నుంచి తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

ఎలమంచిలి మునిసిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి వద్ద వరహా నదిలో ఏర్పాటు చేసిన బోరు బావుల నుంచి మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుంటారు. ఇందుకోసం ... మిగతా 8వ పేజీలో



పోలిమేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద దెబ్బతిన్న ప్రధాన పైపులైన్

పండుగలా అన్నదాత సుఖీభవ

- రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేలచొప్పున రేపు జమ
- జిల్లాలో 2,31,688 మంది అన్నదాతలకు లబ్ధి

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన' కార్యక్రమాన్ని ఆగస్టు రెండో తేదీన పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని సీఎం ప్రసంగాన్ని ఆలకించారు. అనంతరం ఆమె జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన కింద అర్హులైన రైతులందరికీ ఆర్థిక సాయం అందేలా ... మిగతా 8వ పేజీలో



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్

బల్క్ డ్రగ్ పార్కుతో ముప్పు

ప్రజా శాస్త్రవేత్తలు, ప్రజా సంఘాల ఆందోళన

- లోపభూయిష్టంగా ఈఐఏ నివేదిక
- ఉద్యోగ, ఉపాధి కల్పన పేరుతో ప్రమాదంలోకి ప్రజల ఆరోగ్యం



బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో జరుగుతున్న పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **జిల్లాలోని నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న బల్క్‌డ్రగ్ పార్క్‌పై సామాజిక పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) నివేదిక తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పు పొంచివుందనే అభిప్రాయాన్ని ప్రజా శాస్త్రవేత్తలు, మానవ హక్కుల వేదిక, ప్రజా సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు.**

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తున్నది. ఇటీవలే సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా భూములను బదిలీ చేయాలని నిర్ణయించారు. గతంలో ప్రతిపాదించిన మేరకు 2002 ఎకరాలను కేటాయించారు. ఈ భూముల్లో ఏపీఐఐసీ ఇప్పటికే అభివృద్ధి పనులు చేస్తున్నది. బల్క్ డ్రగ్ పార్కులో ఫార్మా కంపెనీల ఏర్పాటు ద్వారా రూ.14 వేల కోట్ల పెట్టుబడులు రావచ్చని అంచనా వేస్తున్నారు. ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. ఆగస్టు 6వ తేదీన నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నేపథ్యంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుపై ఈఐఏ నివేదిక లోపభూయిష్టంగా ఉందంటూ ప్రజా శాస్త్రవేత్తలు, మానవ హక్కుల వేదిక ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పలు అంశాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం గురించి నివేదికలో సహేతుకంగా లేదని, రసాయన ఉత్పత్తుల ప్రక్రియలకు సంబంధించి అసమగ్రంగా నివేదికలో పొందుపర్చారని పేర్కొన్నారు. గాలి నాణ్యతపై అంచనాలు అసత్యంగా ఉన్నాయని ... మిగతా 8వ పేజీలో

పయనీర్ లారీలకు భారీ జరిమానా

- రూ.3,92,000 పెనాలిటీ విధించిన రవాణా శాఖ అధికారులు



పోలీసులు సీజ్ చేసిన లారీలు (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పయనీర్ కంపెనీకి అధికలోడుతో వస్తున్న లారీలకు నర్సీపట్నం ఎంవీఐ రూ.3,92,000 జరి మానా విధించినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం విశాఖపట్నం నుంచి నర్సీపట్నం వస్తుండగా.. మాకవరపాలెం మండలం రాజుపేట సమీపం లో అధిక లోడుతో ... మిగతా 8వ పేజీలో

సమాధుల స్థలం కబ్జాపై రగడ

మునిసిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్, వైస్‌చైర్మన్ వాగ్వాదం

- అంశం కోర్టు పరిధిలో ఉందన్న కమిషనర్
- పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులు మంజూరయ్యాయని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి వెల్లడి



టీడీపీ కౌన్సిలర్, వైస్ చైర్మన్ వాగ్వాదం

నర్సీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): **పట్టణంలో బ్రిటీష్ సైనిక అధికారుల సమాధుల స్థలం కబ్జా, అక్రమ నిర్మాణాలపై వైస్ చైర్మన్లు, టీడీపీ కౌన్సిలర్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. దుకాణాల నిర్మాణాలను అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని వైసీపీకి చెందిన వైస్‌చైర్మన్లు ప్రశ్నించారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో వుందని, న్యాయస్థానం జారీ చేసే తుది ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ వివరణ ఇచ్చారు.**

చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నర్సీపట్నం మునిసిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంకు, ఓడీఎఫ్ ప్లస్‌కు ఎంపిక కావడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మరింత మెరుగైన ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు వీఎంఆర్‌డీఏ నుంచి రూ.5 కోట్లు మంజూరుకు కృషి చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి నారాయణకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తర్వాత వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, పట్టణంలో మెయిన్ రోడ్డుని ఆనుకొని ఉన్న బ్రిటీష్ సైనిక అధికారుల సమాధుల స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిని ఎందుకు అడ్డుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి జోక్యం చేసుకుంటూ.. షాపుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారా అని టీపీవో సత్యనారాయణను ప్రశ్నించారు. ప్లాన్ అనుమతులు ఇవ్వలేదని ఆయన బదులిచ్చారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, గత వారం స్థలం చుట్టూ పరదాలు కట్టగా, సిబ్బందిని ... మిగతా 8వ పేజీలో

సింహగిరిపై పెళ్లిళ్లకు రూ.10 వేలు చార్జి

- గజపతి సత్రం, లోవ తోట సహా ఎంపిక చేసిన ప్రాంతాల్లో అనుమతి
- కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు

సింహచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో వివాహం చేసుకోదలచినవారు దేవస్థానానికి పది వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు. గతంలో ఉచితంగానే అనుమతించేవారు. మూడేళ్ల క్రితం టెండర్ పిలిచి కాంట్రాక్టుకు ఇచ్చారు. దేవస్థానం నిర్ణయించిన ధర కంటే ఆ కాంట్రాక్టర్ అధికంగా వసూలు చేస్తూ భక్తులను ఇబ్బంది పెడుతున్నారంటూ హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. దాంతో అధికారులు కాంట్రాక్టు విధానానికి స్వస్తి చెప్పడానికి సమ్మతించారు. గురువారంతో కాంట్రాక్టు ముగిసింది. ఈ నేపథ్యంలో సింహగిరిపై అనుమతించిన స్థలాల్లో పెళ్లిళ్లు చేసుకోవాలనుకునేవారు రూ.10 వేలు చెల్లించి నెలరోజుల ముందుగానే ఆ ప్రాంతాలను రిజర్వు చేసుకోవాలంటూ ఈఓ ప్రకటన విడుదల చేశారు. తాజా ఆదేశాల ప్రకారం గజపతి సత్రం, పాదాలమ్మ, బంగారమ్మ గుడి ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రాంతం, లోవ తోట, అదేవిధంగా ప్రత్యేక కండిషన్‌లో అధికారులు సమ్మతించిన స్థలాల్లో వివాహాలకు ... మిగతా 8వ పేజీలో

సాగునీటి కాలువలకు మహర్దశ

టీడీపీ నేతలు చించలపు ప్రదీప్, పెదిరెడ్డి చిట్టిబాబు



రాజవరం కాలువలో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి కాలువలకు మంచి రోజులొచ్చాయని టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని రాజవరం కాలువలో పూడికతీత పనులను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి కాలువలకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. సాగునీటి కాలువలలో పూడిక పెరిగిపోయి, గేట్లకు తలుపులు లేక చివరి ఆయకట్టు భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయడంతో సాగునీటి కాలువలలోని పూడికతీత పనులు చేపట్టడం జరిగిందన్నారు.

ఇప్పటికే కొన్ని స్లూయిజ్‌లకు తలుపులు కూడా వేశారన్నారు. రాజవరం ఛానల్ నీటి సంఘం అధ్యక్షుడు పెరుమళ్ళ గోవిందరావు మాట్లాడుతూ రూ.2.6 లక్షలతో కాలువలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ సురేశ్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథ్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొడుకుల రాంబాబు, వేములపూడి అప్పారావు, డైరెక్ట ర్లు అడపా శ్రీను, చేదులూరి రామచంద్రరావు, హరి పాల్గొన్నారు.

సీఎం సూర్యఘర్ లక్ష్యాలను సాధించాలి

»» వీవోఏలకు ఎంపీడీవో సీతారామరాజు ఆదేశం

నక్కపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల భారం లేకుండా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకంలో లబ్ధిదారులు కావాలని, ఈ మేరకు వీవోఏలు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో డీ సీతారామరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం గురించి ఆయన వివరించారు. ఒక్కో వీవోఏ వంద మందికి అవగాహన కల్పించాలని, ఈ లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చలపతిరావు, డిప్యూటీ ఎస్ఈ నారాయణరావు, ఉపాధి పథకం ఏపీవో భాగ్యలత, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గళం విప్పిన కౌన్సిలర్లు

- రోడ్లు, కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన
- కొక్కిరాపల్లిని పంచాయతీగా మార్చాలని కోరిన కౌన్సిలర్ రామకృష్ణ
- కౌన్సిలర్ రామకృష్ణతో వైస్ చైర్మన్లు వాగ్వాదం
- సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోండి : చైర్‌పర్సన్



సమావేశంలో కొక్కిరాపల్లి కౌన్సిలర్‌తో వాగ్వాదం చేస్తున్న వైస్ చైర్మన్లు

ఎలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సౌకర్యార్థం రాయితీపై అందిస్తున్న సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ కౌన్సిలర్లతో పాటు ఉద్యోగులంతా ప్రజల్లో అవగాహన కల్పించి సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే అర్బన్ మార్కెట్‌ను అందరూ ఆదరించాలన్నారు. యర్రవరం కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధి కుంటుపడిందని, రోడ్డు, కాలువల నిర్మాణాలు చేయకుంటే ప్రజలు ఎలా జీవించాలని ప్రశ్నించారు. కొత్తపాలెం కౌన్సిలర్ సంతోష్, రామారాయుడుపాలెం తదితర కౌన్సిలర్‌తో పాటు చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ మునిసిపాలిటీలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ ఏఈ కనకరాజును కోరారు. కొక్కిరాపల్లి కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ మాట్లాడుతూ తమ వార్డును మునిసిపాలిటీ నుంచి తొలగించి గ్రామపంచాయతీగా మార్పు చేసేలా కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ కౌన్సిల్ తీర్మానం చేసేందుకు సంతృప్తిగా లేనని, అలా అయితే విలీన గ్రామాలు కూడా అదే బాటలో ఉంటాయని, ఈ విధానం మంచిది కాదన్నారు. వార్డును అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని, పెదపల్లి ప్రాంతంలో రానున్న రోజుల్లో పరిశ్రమలు రానున్నాయని దీంతో ఆ ప్రాంతం అంతా అభివృద్ధి చెందుతుందన్నారు. మజ్జి రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మునిసిపాలిటీలో టీడీపీ కౌన్సిలర్‌ని నేనొక్కడినే గెలిచానని, తన వార్డు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని అంటున్న సమయంలో వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తాలు లేచి అప్పుడు ఎందుకు అడగలేదని, ఇప్పుడు అడిగితే ఎలా ప్రశ్నించారు. దీంతో వీరి మధ్య కొంతసేపు వాగ్వావాదం చోటుచేసుకుంది. అనంతరం పలు సమస్యలతో పాటు అజెండాలోని అంశాలపై చర్చ కొనసాగించారు. సమావేశంలో కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పిల్లమ్మ గెడ్డ

- కాలువలోకి సెజ్ పరిశ్రమల వ్యర్థజలాలు
- లాలంకోడూరులో దుర్వాసన
- మృత్యువాత పడుతున్న పశువులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పిల్లమ్మగెడ్డ కాలువలో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు



వ్యర్థ జలాలు నిలిచిపోయి నాచుకట్టిన దృశ్యం

రాంబిల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరు గ్రామాన్ని ఆనుకొని ఉన్న పిల్లమ్మ గెడ్డలోని మురుగునీరు భరించరాని కంపు కొడుతోంది. సుమారు 2వేల జనాభా కలిగి ఉన్న ఈ గ్రామంలో ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల పరిధిలో 9,300 ఎకరాల్లో ఎస్ఈజెడ్ (సెజ్)ను ఏర్పాటు చేశారు. సెజ్‌లో ఏర్పాటు చేసిన ఫార్మా పరిశ్రమలు, నాన్ ఎస్ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన మరికొన్ని ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువుతో పాటు రహదారులను ఆనుకొని ఉన్న కాలువల్లోకి విడిచిపెడుతున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న పిల్లమ్మగెడ్డ లోకి కంపెనీలు వ్యర్థ జలాలను వదిలేస్తున్నాయి. ఈ కాలువలో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు నాచుకట్టి ఉండడంతోపాటు, నల్లని రంగులోకి మారిపోయి భరించరాని వాసన వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాసనను భరించలేకపోతున్నామని, దోమల తీవ్రత కూడా పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఈ కాలువలోని నీరు తాగిన ఆవులు, గేదెలు, మేకలు ఇప్పటికే మృత్యువాత పడ్డాయని వారు తెలిపారు. గ్రామానికి అతి సమీపంలో పలు పరిశ్రమలు ఉండడంతో ఇప్పటికే ఈ పంచాయతీలోని పలుగ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పరిశ్రమలు వ్యర్థ జలాలను విడిచిపెడుతుంటే తమ పరిస్థితి ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి తమ గ్రామ పరిధిలో గల కాలువల్లోకి ఫార్మా కంపెనీల వ్యర్థ జలాలను విడిచిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని లాలంకోడూరు పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

భరోసా ఇవ్వండి.. లేకుంటే 109 ఎకరాలు చూపండి

న్యాయం కోసం పూడిమడక సచివాలయం ఎదుట మత్స్యకారుడి ఆందోళన

భూమి ఉందని మత్స్యకార భరోసా ఆపేసిన అధికారులు



పూడిమడక సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బండియ్య

అచ్యుతాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అధికారుల లీలలు ప్రభుత్వానికి అపఖ్యాతి తెచ్చిపెడుతున్నాయి. సెంటు భూమి లేని వ్యక్తికి 109 ఎకరాలు చూపించి మత్స్యకార భరోసాని అధికారులు ఆపేశారు. నాకు చేపల వేటే జీవనాధారమని చెబుతూ మండల, జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ పేద మత్స్యకారుడు 109 ఎకరాలు చూపించండంటూ అధికారులను వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని పూడిమడకలో కొవిరి బండియ్య చేపల వేట సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన మత్స్యకార భరోసా ఆయనకు రాలేదు. ఎందుకని ఆయన సచివాలయానికి వెళ్లి ఆరా తీశాడు. నీ భార్య దేవి పేరున 109 ఎకరాల భూమి ఉంది. నీకు ఎలా మత్స్యకార భరోసా పడుతుందని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. తనకు సెంటు భూమి కూడా లేదని, చేపల వేటే జీవనాధారమని బండియ్య లబోదిబోమన్నాడు. దీంతో మత్స్య శాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. చేసేది లేక పూడిమడక సచివాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశాడు. భరోసా అయినా ఇవ్వండి.. లేకుంటే తన భార్య దేవి పేరున వివిధ సర్వే నంబర్లలో ఉన్న 109 ఎకరాల భూమైనా చూపండని ఆందోళన చేశారు. ఈ మత్స్యకారుడు బండియ్య ఆందోళనకు సీపీఎం నాయకుడు చేపల తాతయ్య మద్దతు తెలిపారు. ఈ మత్స్యకారుని గురించి జిల్లా స్థాయిలో పోరాడతామని తాతయ్య తెలిపారు.

జడ్పీ గెస్ట్‌హౌస్ ఆక్రమణకు గురికాకుండా చర్యలు

»» సీఈవో నారాయణమూర్తి



శిథిలావస్థలో ఉన్న గెస్ట్ హౌస్‌ను పరిశీలిస్తున్న సీఈవో నారాయణమూర్తి

ఎస్.రాయవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగుమ్ములూరు రెవెన్యూ పరిధిలోని జడ్పీ గెస్ట్ హౌస్ ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని విశాఖ జడ్పీ సీఈవో నారాయణమూర్తి అన్నారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన జడ్పీ గెస్ట్ హౌస్‌ను సీఈవో నారాయణమూర్తి పరిశీలించారు. గెస్ట్‌హౌస్ ఆక్రమణ కాకుండా చుట్టూ పెన్సింగ్ వేస్తామన్నారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన సర్వేలో వేమగిరి గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదని అందిన ఫిర్యాదు మేరకు ఆ గ్రామంలో సీఈవో పర్యటించారు. తొలుత సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పారిశుధ్యంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సంపద కేంద్రాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక అధికారులను జడ్పీ సీఈవో ఆదేశించారు. మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై సామాజిక కార్యకర్త నూకరాజు చేసిన ఫిర్యాదు మేరకు మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వాటిపై తహశీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణలను విచారించారు. తర్వాత గుడివాడ పంచాయతీ పరిదిలో ఉన్న సంపద కేంద్రాన్ని జడ్పీ సీఈవో నారాయణమూర్తి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శ్రీనిబాబు, టీడీపీ నాయకుడు పోతు రంగారావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం

పాయకరావుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట మండల ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక బృందావనం పాఠశాలలో జరిగిన ఏపీటీఎఫ్ సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్.ధర్మారావు ఆధ్వర్యంలో మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.మహేష్, డి.వెంగళరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఎస్.రవి కృష్ణ, సీహెచ్ఎం.గంగాధర్, ఎ.ప్రేమానందం, పి.బృందాదేవి, కార్యదర్శులుగా పి.సాయిబాబు, జీవీ.భాస్కర్, ఎ.శివశంకర్, ఎన్.శారద, జిల్లా కౌన్సిలర్లుగా కె.నూకరాజు, పీవీ.గణేష్, బి.సునీతరాణి, పి.రవికృష్ణ, వి.శ్రీనివాసరావు, జీఎల్ఎన్.దిలీప్, వి.వెంకటరావు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికల పరిశీలకులుగా డి.కొండలరావు, బి.శ్రీనివాసరావు వ్యవహరించారని తెలిపారు.

ఫ్లోరోసిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోటవురట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో ఫ్లోరోసిస్‌కు గురైన వారిని వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సర్వే నిర్వహించాలన్నారు. ఫ్లోరోసిస్ ఎక్కువగా ఉన్న తాగునీరు సేవించడం ద్వారా ఈవ్యాధి పిల్లల్లో సోకినట్టుయితే దంతాలపై మచ్చలు, ఏర్పడతాయన్నారు. పెద్దవారిలో అయితే ఎముకలు బలహీనపడతాయన్నారు. వారిలో తొందరగా ముసలితనం, కీళ్ల నొప్పులు వస్తాయన్నారు. ఈ వ్యాధిపై లింగాపురం, కొడవటిపూడి, కోటవురట్ల-1, కోటవురట్ల-2, సచివాలయాలు పరిధిలో గల గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఎంపీహెచ్‌వోలు బుల్లి బాబు, బెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

పాయకరావుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరాకాలనీ, బృందావనం కాలనీలో పాటు మండలంలోని అరట్లకోటలో ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాళ్ల వరహాల బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కట్టా శ్రీను, నాయకులు గొల్లపల్లి నాగు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి



వంటశాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ

ఎలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని సబ్ జైలును గురువారం ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు జైలు పర్యవేక్షణాధికారి ఎం.ప్రసాద్ తెలిపారు. సబ్‌జైలు సముదాయాన్ని,వంటశాలను పరిశీలిం చారని చెప్పారు. ఆమె వెంట లీగల్ ఎయిడ్ న్యాయవాదులు పి.వి.రమణ, హరి శంకర్, జైలు వార్డర్ శివకుమార్ రాజు ఉన్నారని తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయండి

»» ఐసీడీఎస్ పీడీ ఇందిరాదేవి



సూపర్‌వైజర్లతో సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో కె.ఇందిరాదేవి

ఎలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్)ప్రాజెక్టు పరిధిలో శుక్రవారం నుంచి వారం రోజులు పాటు నిర్వహించే తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎలమంచిలి సీడీపీవో కె. ఇందిరాదేవి కోరారు. గురువారం సాయంత్రం లైను కొత్తూరులోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందుకు సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. శుక్రవారం ఉదయం ఎలమంచిలి సీహెచ్‌సీ వద్ద తల్లి పాల వారోత్సవాలను ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఈ వారోత్సవాలను ప్రతి గ్రామంలోనూ విజయవంతం చేయాలని సూచించారు.

సేవ చేసే ఉపాధ్యాయులకు గుర్తింపు

విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి



నిర్మలను సన్మానిస్తున్న విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి, ఉపాధ్యాయులు,నేతలు

అచ్యుతాపురం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సేవ చేసే ఉపాధ్యాయులకు పదవీ విరమణ చేసినా సంఘంలో మంచి గుర్తింపు ఉంటుందని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి అన్నారు. మండలంలోని చౌడపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు దాట్ల నిర్మల పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం పదవీ విరమణ చేసిన నిర్మలను టీడీపీ నాయకులు కర్రి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సావిత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు కర్రి నాగేశ్వరరావు, వి.సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, కాకి అప్పారావు, కొల్లి శ్రీను, అర్జున్‌రావు, శంకరరావు, అప్పలరాజు, శ్రీను, రాంబాబు, అనసూయ, అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి'



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్. సోమేశ్వరరావు

ఎలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి. జగన్నాథరావు, ఎలమంచిలి తాలూకా సంఘాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం అభివృద్ధి నివేదికను కోశాధికారి సమావేశం ముందుంచారు. అనంతరం సంఘ అభివృద్ధికి పలువురు సభ్యులు సూచనలు చేశారు. 75 ఏళ్లు నిండిన నలుగురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.సత్యారావు, స్థానిక కార్యదర్శి జి. సాంబమూర్తి, పెన్షనర్లు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ తరగతులు

నక్కపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం ఓరియేంటేషన్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఉన్నత విద్యా మండలి ప్రతిపాదించిన స్కిల్ పేపర్స్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటం టెక్నాలజీలపై ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య అవగాహన కల్పించారు. బీఎస్సీలో మ్యాథ్స్ కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీ మేజర్ కోర్సులు అందుబాటులో వున్నాయని చెప్పారు. డిగ్రీలో చేరిన విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో నిరంతరం శ్రమించాలని ఆయన సూచించారు.

పీ4 సర్వేను త్వరగా పూర్తి చేయాలి : ఎంపీడీవో



శ్రీరాంపురంలో పీ4 సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయప్రకాశరావు

పాయకరావుపేట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీ4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు అన్నారు. గురువారం శ్రీరాంపురంలో ఆయన సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న పీ4 సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పీ4 సర్వేను నిర్వహిస్తుందన్నారు. పేదలకు ఆర్థికంగా, సామాజికంగా న్యాయం చేయడం, ఉపాధి అవకాశాలను కల్పించడం, వారికి ఏవిధంగా సహాయం చేయాలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైవీసత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన : సీఐ

అచ్యుతాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని సీఐ నమ్మి గణేష్ అన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై కూడా అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఇంటి నుంచి పాఠశాలకు వచ్చినప్పుడు, తిరిగి ఇంటికి వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కి పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థి దశలో తప్పటడుగులు వేస్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మునగపాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. శిల్పి స్వామిజీకి నిర్మాణ పనులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆలయ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు దొడ్డి కోటేశ్వరరావు, దొడ్డి బాలాజీ, పొలమరశెట్టి మురళీకృష్ణ, ఎంవీఆర్.నాయుడు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో చూచుకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో చూచుకొండ, గణపర్తి, పల్లపు ఆనందపురం, కుమారపురం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

ఎమ్మెల్సీ నాగబాబుకు సత్కారం



నాగబాబును సత్కరిస్తున్న జనసేన నేతలు చందు, పవన్‌విజయ్

రాంబిల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర నేత, ఎమ్మెల్సీ కొణెదల నాగబాబును ఆ పార్టీ సీనియర్ నాయకులు లాలం చందు, పవన్‌విజయ్ గురువారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును వారు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, కొణతాల రామకృష్ణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు భూసేకరణ ఆపాలని వినతి

అచ్యుతాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం రింగ్ రోడ్డు కోసం తమ భూములను తీసుకోవద్దని రామన్నపాలెం వాసులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపాలెం నుంచి చోడపల్లి వరకు రింగ్ రోడ్డు నిర్మాణానికి సేకరిస్తున్న భూముల్లో అధిక భాగం రామన్నపాలెంకి చెందిన రైతులే ఉన్నారన్నారు. ఈభూమిని ప్రభుత్వం రోడ్డు నిమిత్తం తీసుకుంటే తమకు ఉపాధి లేకుండా పోతుందని, అందువల్ల తమ భూములను తీసుకోకుండా వేరే మార్గాలు చూడాలని వారు కోరుతున్నారు. వినతిపత్రాన్ని ఇచ్చిన వారిలో ధర్మిరెడ్డి రామమూర్తి, అప్పలకొండ, రాము, నారాయణ, లాలం సత్తిబాబు ఉన్నారు.

నిబంధనల మేరకు ఫీజులు తీసుకోవాలి

ఎలమంచిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విద్యార్థుల నుంచి ఫీజులు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ వరహాలుకు వినతిపత్రం అందజేసినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కృపానంద, లక్ష్మణ్, కవిత, రమ్య పాల్గొన్నారు.

పంచాయతీల్లో శానిటేషన్ పనుల పరిశీలన

నక్కపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం శానిటేషన్ పనులను ఎంపీడీవో డీ సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ చలపతిరావు పరిశీలించారు. వేంపాడు, వేంపాడు కొత్తూరు, నక్కపల్లి రెల్లికాలనీల్లో ఇంటింటా చెత్త సేకరణను పర్యవేక్షించారు. తడి,పొడిచెత్తను ఇంటింటి నుంచి సేకరించి, సంపద కేంద్రాలకుతరలించాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. వారి వెంట సెక్రటరీ రాజశేఖర్ ఉన్నారు.

పీ-4 సర్వేపై ఎంపీడీవో సమీక్ష

కోటవురట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వ్యక్తగత, సామాజిక అవసరాల గుర్తింపు కోసం నిర్వహించే పీ-4 సర్వేపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడిఅవసరాలను పీ-4 సర్వేలో గుర్తించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు ఆగస్టు ఒకటో తేదీ ఉదయం ఏడు గంటలకు ప్రారంభించాలన్నారు. పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తచెదారం లేకుండా చూడాలన్నారు.

'సుజల స్రవంతి'

కాలువ అలైన్‌మెంట్ మార్చండి

▸▸ ఎమ్మెల్యే 'పంచకర్ల'కు రైతుల వినతి



ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు సమస్యను వివరిస్తున్న రైతులు

సబ్బవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నుంచి మండలంలోని అయ్యన్నపాలెం వద్ద భూదేవి చెరువుకు వచ్చే బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్‌ను మార్చాలని యాతపాలెం, రాయపురఅగ్రహారం, వంగలి, నల్లరేగులపాలెం గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును గురువారం సబ్బవరంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు దొడ్డి సూర్య ప్రకాశరావు, శరగడం వెంకటరావు, అనంతరాం, రాపేటి శివరాం తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ వలన ఇళ్లు, ఖరీదైన భూములు కోల్పోనున్నామని వాపోయారు. పాత అలైన్‌మెంట్ వలన ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందన్నారు. పాత అలైన్‌మెంట్‌లో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయని వివరిరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని వివరించారు.

అల్లు రామలింగయ్యకు అంజలి



అల్లు రామలింగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజానాట్య మండలి

తుమ్మపాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హాస్యనటుడు అల్లు రామలింగయ్య వర్ధంతిని గురువారం ఇక్కడి సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి జిల్లా గౌరవాధ్యక్షుడు రాజాన దొరబాబు మాట్లాడుతూ అల్లు రామలింగయ్య ప్రజా నాట్యమండలిలో సుదీర్ఘకాలం పనిచేసి గుర్తింపు పొంది, సినీరంగంలోకి ప్రవేశించారన్నారు. తమదైన శైలిలో ప్రజలను తన హాస్యంతో కడుపుబ్బా నవ్వించిన గొప్ప నటుడుగా పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నట్టు చెప్పారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి దేముడుబాబు, సహాయ కార్యదర్శి వియ్యపు రాజు, కోశాధికారి కె.రవీంద్ర, జిల్లా సమితి సభ్యులు ఆళ్ల సత్తిరాజు, విత్తనాల పోతురాజు, పప్పల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో వ్యర్థాలను చెత్తలో కలపరాదు : జడ్సీ

అనకాపల్లి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రుల్లోని వ్యర్థాలను చెత్తతో కలిపి జీవీఎంసీ వాహనాల్లో వేయరాదని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని పూడిమడక రోడ్డులో గల పలు ప్రైవేటు ఆసుపత్రుల పరిసరాలను గురువారం ఆయన పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఆసుపత్రుల్లో సిరంజిలు, సూదులు, ఇతర వ్యర్థాలను జీవీఎంసీ చెత్త కుప్పల్లో ఎట్టి పరిస్థితుల్లో వేయరాదన్నారు. దీనివల్ల పశువులకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. అటువంటి వ్యర్థాలను ప్రత్యేకంగా వేసి ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. క్యాంటీన్‌కు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

'సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలపై ఆందోళన'



బాలుర వసతిగృహం విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యక్షుడు చైతన్య

పరవాడ/లంకెలపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలపై ఆందోళనలు చేపడతామని వైసీపీ స్టూడెంట్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానగంటి చైతన్య అన్నారు. జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం బీసీ బాలుర వసతి గృహాన్ని గురువారం సందర్శించారు. అన్ని గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్, 85వ వార్డు వైసీపీ అధ్యక్షుడు పూర్ణానందశర్మ, నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, గెంజి సురేష్, రాయి రాజు, హేమంత్, మురళీ పాల్గొన్నారు.

'సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం'



మాట్లాడుతున్న జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారిణి జి. పరమేశ్వరి

అనకాపల్లి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పట్టు పరిశ్రమలశాఖ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారిణి జి.పరమేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం పట్ల అవగాహన ఉండాలన్నారు. అప్పుడే చట్టం సక్రమంగా అమలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

సబ్బవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 1న రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి చలో విజయవాడ పోస్టర్‌ను గురువారం సబ్బవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా కనీసం సీపీఎస్ విధానంపై ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు గూనూరు శ్రీను, మధుకృష్ణ, అప్పాజీ, ప్రతాప్, ఆనంద్, భాస్కర్, డెక్క శ్రీను, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో తప్పిదాలు ఉండరాదు

▸▸ ప్రతి డాక్యుమెంట్‌ను పక్కాగా పరిశీలించండి ▸▸ రెవెన్యూ లక్ష్యాలను చేరుకోండి ▸▸ సబ్ రిజిస్ట్రార్‌ల వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్‌లు నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను విధిగా చేరుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో గల సబ్ రిజిస్ట్రార్‌లతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజిస్ట్రార్ కార్యాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. రీసర్వే అయిన గ్రామాల్లో పలుచోట్ల ఒకరి పేరుమీద ఉన్న ఆస్తి వేరొకరి పేరిట నమోదైందని, వెంటనే వేరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం వంటి జరుగుతున్నాయని తరుచూ వినతులు అందుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్‌పీఎం ఆధారంగా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రతి డాక్యుమెంట్ విషయంలో లింక్, ఈసీ తప్పక చూసి పూర్వ యాజమాన్య హక్కులను రూఢీకరించుకోవాలని ఆదేశించారు. వివాహ రిజిస్ట్రేషన్ విషయంలో కూడా పబ్లిక్‌కు ఫెసిలిటేషన్ డెస్క్ చేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అన్ని రకాల బాకీలు నిర్ణీత సమయంలో వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ వహించరాదని స్పష్టం చేశారు. రాబోయే సమీక్ష నాటికి ఈ విషయంలో పురోగతి కనిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు, పది మంది సబ్ రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ రిజిస్ట్రార్‌లతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య

▸▸ కేజీబీవీ కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్ల శిక్షణ శిబిరంలో ఆర్జేడీ విజయభాస్కర్

సబ్బవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించేందుకు కృషి చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ పిలుపునిచ్చారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న కేజీబీవీ కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్ల శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్ పూర్తి చేయడమే లక్ష్యం కాదని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన జరగాలని సూచించారు. చేసే ప్రతి పనిని మనస్ఫూర్తిగా చేస్తే సత్ఫలితాలు సాధించవచ్చునని వివరించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.జయప్రకాశ్, రాష్ట్ర శేషగిరిరావు, జీసీడీవో ఏఎస్‌డీ జమీమా, ఏఎంవో కె.జయ తదితరులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.





కేజీబీవీ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్



జడ్సీని కలిసిన 82, 83వ వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు, నాయకులు

డంపింగ్ యార్డును తరలించండి

▸▸ జడ్సీ చక్రవర్తికి టీడీపీ నాయకుల వినతి

అనకాపల్లి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డున జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని జీవీఎంసీ 82, 83వ వార్డులకు చెందిన టీడీపీ ఇన్‌చార్జిలు పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్ కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని గురువారం కలిసి సమస్యను వివరించారు. డంపింగ్ యార్డు ఇక్కడ ఉండడం వల్ల పరిసరాల ప్రజలతో పాటు యార్డుకు ఆనుకొని ఉన్న జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించాలన్నారు. అలాగే ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. ఇదిలావుంటే, నూతనంగా బాధ్యతలు చేపట్టిన అతనిని వారంతా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్లి శేఖర్, పొలిమేర ఆనంద్‌కుమార్, మారిశెట్టి శంకరరావు, ఎస్.బానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ బోజరాజుకు సన్మానం



బోజరాజు దంపతుల సన్మానంలో పోలీసు అధికారులు

అనకాపల్లి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయం పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి గురువారం పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ కె.బోజరాజును ఇక్కడి పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావులు బోజరాజు దంపతులను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒత్తిడితో కూడుకున్న పోలీస్ ఉద్యోగంలో 36 ఏళ్లు పనిచేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

2న ఉపాధ్యాయుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో ప్రతినిధులు

కొత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న బోధనేతర, ఆర్థిక పరమైన పద్దెనిమిది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు రెండో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని ఫ్యాప్టో ప్రతినిధులు తెలిపారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు అధ్యక్షతన గురువారం ఇక్కడ కార్యవర్గ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిందిగా కోరారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. శనివారం చేపట్టనున్న ఆందోళన కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా తరలి రావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో ప్రతినిధులు వై.సుధాకర్‌రావు, ఎస్.దుర్గాప్రసాద్, ఆచంట రవి, వత్సవాయి శ్రీలక్ష్మి, మట్ట శ్రీనివాసరావు, వై.కిషోర్, మిత్ర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెర్లోపలి ఖండం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

▸▸ దాడి రత్నాకర్



అనకాపల్లి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెర్లోపలి ఖండం ల్యాండ్‌పూలింగ్‌లో 78 మంది రైతులకు న్యాయం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి- సబ్బవరం రోడ్డులోని గోపాలకృష్ణ థియేటర్ వద్ద 2007లో ల్యాండ్‌పూలింగ్ నిర్వహించి అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, తాను 78 మంది రైతులతో జనవరి నెలలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. ఈ మేరకు న్యాయం చేసిన ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రివర్గానికి రత్నాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

'ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి పరుగు'

పరవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రగతి పథాన నడుపుతున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గొర్లివానిపాలెం, భరణికం గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. విజన్ గల నాయకుడు చంద్రబాబు అని అందువల్లే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గొర్లి కనకారావు, బొండా తాతారావు, మాజీ ఎంపీటీసీ యాసరపు కనకారావు, వర్రి వసంతరావు, గొర్లి రామారావు, సిరికి రామునాయుడు, సోమేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన జంక్షన్లలో రహదారి అధ్వానం

▸▸ మండల పరిషత్ కార్యాలయం, బంగ్లా కూడళ్లలో గోతులు
▸▸ మరమ్మతులు చేపట్టిన మూన్నాళ్లకే పరిస్థితి యథాయథం
▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ వాహనదారులకు అవస్థలు



బంగ్లా జంక్షన్ వద్ద అధ్వానంగా మారిన రహదారి



మండల పరిషత్ కార్యాలయ జంక్షన్ వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు

పరవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం జంక్షన్, బంగ్లా జంక్షన్‌లలో రహదారి అధ్వానంగా మారింది. పలుచోట్ల గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జంక్షన్‌ల గుండా గాజువాక, సింధియా, విశాఖపట్నం, అచ్యుతాపురం, ఫార్మాసిటీ తదితర ప్రాంతాలకు నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు వెళ్లి వస్తుంటారు. పరిశ్రమలకు యంత్ర సామగ్రిని కూడా భారీ వాహనాల ద్వారా నిత్యం తరలిస్తుంటారు. ఇంతటి రద్దీగా ఉండే ఈ కూడళ్ల వద్ద ఏర్పడిన గోతుల కారణంగా వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు నెలల క్రితమే ఇక్కడ రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే గుంతలు ఏర్పడడంతో ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై అంతా మండిపడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే మూన్నాళ్లకే పరిస్థితి మొదటికి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఆయా జంక్షన్లలో రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు పాత పింఛన్లను శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ చేయనున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి ఇస్తారని, పింఛనర్లు అంతా అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు.

ఘనంగా పసరమారమ్మ పండుగ



భక్తుల పూజలందుకున్న అమ్మవారు

కశింకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం గ్రామ పొలిమేర వద్ద ఉన్న పసరమారమ్మ తల్లి పండుగను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా పెద్దఎత్తున గ్రామస్థులు కుటుంబాలతో సహా తరలి వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఘటాలను మేళతాళాలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.

మున్సిపల్ షాపునకు వేలం పాట



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ జంక్షన్‌లోని మున్సిపల్ దుకాణ సముదాయంలో గల 11వ నంబరు షాపునకు గురువారం జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఐదుగురు పాటదారులు హాజరయ్యారు. నెలకు రూ.33 వేలు చొప్పున అద్దె చెల్లించేందుకు ఓ వ్యక్తి పాటను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్సీ కె.చక్రవర్తి, ఇన్‌చార్జి ఆర్వో రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ



పౌష్టికాహారం కిట్లను అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణులు, బాలింతలకు గురువారం రోటరీ క్లబ్ అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు, ప్రముఖ బెల్లం వర్తకుడు కోరుకొండ బుచ్చిరాజు చేతులమీదుగా వీటిని అందజేశారు. ప్రతి నెలా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ రమణాజీ, బి.సూర్యారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా శివరామ్‌ప్రసాద్ నారాయణ



సబ్బవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారిగా ఉన్న కె.శివరామ్ ప్రసాద్ నారాయణ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న పి.పద్మజ నెల రోజులపాటు సామర్లకోటలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను ఆయనకు ఉన్నతాధికారులు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీ సిబ్బంది ప్రచారం

కశింకోట, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పిలుపునిచ్చారు. గురువారం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. డాక్టర్ తిరుపతిరావు, సిబ్బంది శ్రీనివాసరావు, గుర్నాథ గుప్త, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాబు మృతి



కొండబాబు (ఫైల్)

కొత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుగొల్లు అప్పారావు (కొండబాబు) (57) అనారోగ్యం కారణంగా విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో గల ఆయన స్వగృహానికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు డాక్టర్ గండి సత్యనారాయణ, వర్మ, పొన్నగంటి అప్పారావు, గొంతిన భక్తసాయిరాం, ఈర్లె శ్రీరామ మూర్తి తదితరులు చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కొండబాబు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

42 టీడబ్ల్యూ ఆశ్రమోన్నత పాఠశాలల్లో వసతుల కల్పన

» రూ.155.97 కోట్లు మంజూరు

» గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సబ్బవరపు శ్రీనివాసరావు

అరకులోయ, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 42 గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమోన్నత పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు డీపే జుగా పథకం నుంచి రూ.155.97 కోట్లు మంజూరు చేసినట్టు ఏపీ గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ సబ్బవరపు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం అరకులోయ వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీడబ్ల్యూ ఆశ్రమోన్నత పాఠశాలల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. 9 నెలల వ్యవధిలో పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదే విధంగా పీఎం జన్‌మన్ పథకం కింద రాష్ట్రంలో 125 ఎంపీసీ (మల్టీపర్పస్ సెంటర్లు) మంజూరు కాగా, వీటిలో ఇప్పటి వరకు 25 పూర్తికాగా, 117 భవనాలు ఆగస్టు నెలాఖరుకు, మిగిలిన 8 భవనాలు అక్టోబరులో పూర్తి చేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో 55 అభివృద్ధి పనులు(రోడ్లు, భవనాలు, వంతెనలు)కు గాను రూ.98 కోట్లు మంజూరు చేశామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. అడవితల్లి బాట పథకం కింద రాష్ట్రంలో రహదారి సౌకర్యం లేని గ్రామాలు 1,732 ఉన్నాయని ప్రభుత్వం గుర్తించిందన్నారు. వీటిలో 616 రహదారుల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మిగిలిన రహదారుల పనులు కూడా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో అరకు టీడబ్ల్యూ డివిజన్ ఈఈ వేణుగోపాల్, ఏఈఈ అభిషేక్ పాల్గొన్నారు.

బ్యాంకుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్

పాడేరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): బ్యాం కుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్ అన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల చెందిన అధికారులతో గురువా రం తన కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభద్రతా చట్టం లో భాగంగా ప్రతి బ్యాంకు లోపల, బయట సైతం హై సెన్సివిటీ ఉన్న సీసీ కెమేరాలను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే దేశంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన నేరాలను ఎస్పీ బ్యాంకు అధికారులకు వివరించి, పలు ఉదాహరణలు తెలిపారు. ఈ తరుణంలో బ్యాంకుల భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. అటువంటి పరిస్థితులు మన జిల్లాలో జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అందుకు అనుగుణంగా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకుల్లో ఎటువంటి అనుమానాస్పద చర్యలు జరిగినా తక్షణమే అలారం మోగడంతోపాటు, మనకు సమాచారం అందించేలా వ్యవస్థను రూపొందించుకోవాలన్నారు. అలాగే పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిగిన సందర్భాల్లో, సైబర్ నేరాలపై ఖాతాదారులను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని ఆధార్, బయోమెట్రిక్ ద్వారా నగదు లావాదేవీలు జరుగుతున్న క్రమంలో చోటు చేసుకుంటున్న నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల భద్రతతలో పాటు ఖాతాదారులు సైబర్, ఆర్థిక నేరాలకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్పీ అమిత్ బర్ధార్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, వివిధ బ్యాంకుల అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఓడీఎఫ్‌పై సర్వే



గరిమండలో అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడుతున్న రీసెర్చ్ ఇన్విస్టిగేషన్ అడ్వయిజర్లు

కొయ్యూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదరాళ్ళ పంచాయతీ గరిమండ, చీడిపాలెం పంచాయతీలలో ఓడీఎఫ్‌పై ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. సర్వశిక్ష గ్రామీణ్ సర్వే పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఏఎంఎస్ సంస్థ ద్వారా ఈ ప్రక్రియ సాగుతోంది. ఇందులో భాగంగా ఆయా గ్రామాలలో రీసెర్చ్ ఇన్విస్టిగేషన్ అడ్వయిజర్లు హేమంత్ కుమార్, రాజేశ్‌లతో కూడిన బృందాలు గురువారం ఈ గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలల్లో శానిటేషన్, పాఠశాల, అంగన్‌వాడీల పనితీరు ఏ విధంగా ఉంది, గతంలో మంజూరైన మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయా.. తదితర విషయాలపై సర్వే జరుపుతున్నారు. బూదరాళ్ళ పంచాయతీలో గతంలో మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా అధికారులు బారీ అవినీతికి పాల్పడినట్టుగా గరిమండలో జరిపిన సర్వేలో తేలినట్టు ఏఎంఎస్ సంస్థకు చెందిన ప్రతినిధి హేమంత్ కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని నివేదికలో పొందుపరిచనున్నట్టుగా వివరించారు. అనంతరం గ్రామస్థులకు పారిశుధ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాలమ్మ, సంజీవ్ పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే పింఛన్లు: ఎంపీడీవో

చింతపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పింఛన్లను శుక్ర వారం ఉదయం గ్రామ సచివాలయం ఉద్యోగులు ఇళ్ల వద్దకు వచ్చి అందిస్తారని, లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. మండలంలో 9,242మంది పింఛన్ లబ్ధిదారులకు చెందిన రూ.3,91,28,500 సచివాలయం ఉద్యోగులకు అందజేశామన్నారు. ఉదయం నుంచి గృహాల వద్దకు వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారన్నారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే

» అసిస్టెంట్ కలెక్టర్ చిరంజీవి నాగ వెంకట సాహిత్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ చిరంజీవి నాగ వెంకట సాహిత్

పాడేరురూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉంటుదని అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్ అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తలిదండ్రులు సంపాదించిన ఆస్తులను తీసుకుని వదిలేయడం చట్టరీత్యా నేరమన్నారు. పట్టణ ప్రాం తాల్లో కన్న బిడ్డలు పట్టించుకోక అనేమంది వృద్ధులు యాచన చేస్తున్న పరి స్థితి మనం చూస్తున్నామన్నారు. ఈ స్థితిలో సమాజంలో సీనియర్ సిటిజన్ల ను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత మాట్లాడుతూ విద్యా సంస్థల్లో తలిదండ్రులు, వృద్ధుల సంరక్షణ పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వృద్ధుల సంరక్షణపై కళాజాతలతో అవగాహన నిర్వ హించామన్నారు. 70 ఏళ్ల పైబడిన వృద్ధులు ప్రధాన మంత్రి వయో వందన యోజన పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధి టి.రవి మాట్లాడుతూ తలిదండ్రుల పోషణ పట్టించుకోవడం లేదని పిల్లలపై ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలతోపాటు, రూ. 5వేల వరకు జరిమానా, మూడు నెలలు జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌బీఎస్ నంద్, సర్వే సహాయ సంచాలకులు కె.దేవేంద్రుడు, జిల్లా సెరికల్చర్ అధికారి కె.అప్పారావు, డీఈవో పి.బ్రహ్మాజీ రావు, జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, డ్వామా పీడీ విద్యాసాగర్, డీపీవో కేపీ.చంద్రశేఖర్, సీఐ కె.దీనబంధు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న డీఈవో బ్రహ్మాజీరావు, తదితరులు

పాడేరురూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంతరిక్ష సంస్థ (ఇస్రో) భాగస్వామ్యంతో అంతరిక్షంపై ప్రయోగాలు, ఉ పయోగాలపై స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల తలారిసింగిలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ సందస్సులో రోబోటిక్స్, సాటిలైట్, లాంచింగ్, భూ పరిభ్రమణలు, అక్షాంశ, రేఖాంశాలప్రాధాన్యత, ఏఐ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ తదితర సాంకేతిక అంశాలను విద్యార్థులకు వివరించామన్నారు.విద్యార్థులతో ప్రాక్టికల్‌గా చేయిస్తూ అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు, సైన్స్ సిటీ ఆంధ్రప్రదేశ్ కో-ఆర్డినేటర్‌శ్రీకాంత్ బృందం సభ్యులు పలు అంశాలను వివరించారు. తలారిసింగి,లోచలిపుట్టు బాలుర పాఠశాల, ఇంగ్లీషు మీడియం బాలికల, శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాలకు చెందిన 200 మంది చిన్నారులు పాల్గొన్నారు.

'కూటమి'తోనే ప్రజా సంక్షేమం



అంత్రిగుడలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

డుంబ్రిగుడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తోనే పేద ప్రజల సంక్షేమం సాధ్యమవుతందని టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. గురువారం పోతంగి పంచాయతీ అంత్రిగుడ గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మఠం భీమారావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా రేపు

పాడేరురూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ , పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ శనివారం పాడేరులో ధర్నా నిర్వహించనున్నట్టు జిల్లా ఫ్యాప్టో నాయకులు రావుల జగన్మోహనరావు, ముఖి రామకృష్ణ తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లకు 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. కారుణ్య నియామకాల, పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్ బకాయలు చెల్లింపు తదితర 18 సమస్యల పరిష్కారం కోరుతూ ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగలు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు వల్ల వెంకటరమణ, వి.మహేశ్, సీకరి శేషగిరి, గిడ్డి వరలక్ష్మి, కొర్రా ధనుర్జయ్, పి.దేముడు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



తాజంగిలో భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి బీటాలైన్‌లో రూ.12లక్షలజడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. గురువారం ఈ మేరకు జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ఆమె భూమి పూజ చేశారు. అలాగే, బూడిదపాడు గ్రామంలో రూ.7 లక్షల నిధులతో జల్ జీవన్ మిషన్ పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బీటాలైన్‌లో అంతర్గత సీసీ రోడ్డులేక ఆదివాసీలు వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారని, ఈ నేపథ్యంలో నిధులు మంజూరైనట్టు చెప్పారు. బూడిదపాడులో నీటి పథకం నిర్మించడం వల్ల ప్రాంతీయుల నీటి కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరాబు అంగదరావు, కూటమి నాయుడు బెన్నలింగన్నపడాల్ పాల్గొన్నారు.

'సదరం'కు హాజరుకాని దివ్యాంగుల పింఛన్లు నిలిపివేత

కొయ్యూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):సదరం రీ వెరిఫికేషన్‌కు హాజరు కాని దివ్యాంగుల పింఛన్ల పంపిణీని తాత్కాలికంగా నిలుపుతున్నట్టు స్థానిక ఎంపీడీవో వీడీకే ప్రసాద్ తెలిపారు. గురువారం నుంచి మండలంలో గల వివిధ రకాలు గల 7435 ఎన్‌టీర్ భరోసా ఫించన్లు పంపిణీకు గానూ రూ.3.15 కోట్ల నగదు సిద్ధంగా ఉందన్నారు. వికలాంగుల పింఛన్లకు గానూ ఇటీవల నిర్వహించిన సదరం క్యాంపుల్లో రీ వెరిఫికేషన్ జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ధ్రువపత్రం పొందని లబ్ధిదారుల పింఛన్ల పంపిణీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా హోల్డ్‌లో ఉంచుతున్నామన్నారు. రీ వెరిఫికేషన్ రిపోర్టు అందిన అనంతరం తిరిగి అందజేస్తామన్నారు.

'విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి'



పెద్దూరు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచే చిన్నారుల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు అన్నారు. మండల కేంద్రంలో ని పెద్దూరు ఎంపీపీ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులకు కొంతసేపు ముచ్చటించారు. వారితో పాఠ్యపుస్తకాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మరింత సామర్థ్యలను పెంపొందించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో 160పైగా విద్యార్థులు చదువుతున్నారని, వీరికి హెచ్‌ఎం, ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నట్టు గుర్తించారు. మరో ఉపాధ్యాయ పోస్టు భర్తీపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుని వెళ్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలోని వైస్ సర్పంచ్ పి.అర్జున్, హెచ్‌ఎం కె.కుమారి, ఉపాధ్యాయులు శ్రీరాములు, పార్వతి, అప్పారావు, భాషా వలంటీర్ నీల, తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీపీవో సేవలు అభినందనీయం: ఐసీడీఎస్ పీడీ

చింతపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో ఎం. రామలక్ష్మి సేవలు అభినందనీయమని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ ఝాన్సీ రామ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ చేసిన ఏసీడీపీవోకి ఐసీడీఎస్ అధికారులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించిన రామలక్ష్మి వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసి సూపర్‌వైజర్‌గా, ఏసీడీపీవోగా విధులు నిర్వహించారన్నారు.ఆమె గిరిజన ప్రాంతంలోనే సుదీర్ఘ కాలం సేవలందించారన్నారు. ఎంపీపీ కోరాబు అనుషదేవి మాట్లాడుతూ ఏసీడీపీవో రామలక్ష్మి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉండేవారన్నారు. ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీ డీవో సీహెచ్ సీలా మహాలక్ష్మి, సీడీపీవో శ్రీదేవి, శర్మ పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉపాధ్యాయరాలికి సన్మానం

డుంబ్రిగుడ: మండలంలోని గేదలబంద మోడల్ ప్రైమరీ స్కూల్ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రజితకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గత 32 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో మంది చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దారని ఈసందర్భంగా ఎంఈవో సుందరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ టి. అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ సుబ్బారావుకు ఘనంగా వీడ్కోలు



పదవీ విరమణ చేసిన డీఈఈ సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న టీడబ్ల్యూ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఈఈ, ఏఈఈలు

అరకులోయ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వృత్తిపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి డీఈఈ సుబ్బారావు అని గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ సబ్బవరపు శ్రీనివాసరావు కొనియాడారు. గురువారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో అరకు సబ్‌డివిజన్ ఈ ఈ వేణుగోపాల్ ఆధ్వర్యంలో డీఈఈ సుబ్బారావు పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించారు. సుబ్బారావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు తొలుత ఏఈఈగా పార్వతీపురం ఐటీడీఏలో పోస్టింగ్ రాగా, సుబ్బారావు వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారన్నారు. అప్పటినుంచి ఎంతో చిత్తశుద్ధితో విధులునిర్వర్తిస్తూ డీఈఈగా ఆయన పదవీ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర ఇంజనీర్లసంఘం అధ్యక్షుడు పాత్రుడు మాట్లాడుతూ అందరితో కలసిమెలసి పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అరకు డివిజన్ ఈఈ వేణుగోపాల్ మాట్లాడుతూ సుబ్బారావు శేష జీవితం ఆ నందంగా గడపాలన్నారు. సన్మాన గ్రహీత సుబ్బారావు మాట్లాడుతూ తనకు ఉద్యోగ నిర్వహణలో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఈ వీకే నాగేశ్వరరావు, రిటైర్డు ఈఈ జోగారావు , టిడబ్ల్యూ ఇంజనీరింగ్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాత్రుడు, పలువురు ఇంజనీరింగ్ అధికారులు, ఏఈఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి: ఎంపీడీవో



అంతర్లలో పూడికతీతను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతా మహాలక్ష్మి అన్నారు. గురువారం ఎంపీడీవో స్థానిక పంచాయతీ పరిధి అంతర్ల గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గృహాల నుంచి నేరుగా తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రా సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందన్నారు. పంచాయతీ సిబ్బంది ప్రతి రోజు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గృహాల వద్దకు వచ్చి తడి, పొడి చెత్తను సేకరించనున్నట్టు చెప్పారు. గిరిజనులు చెత్తను గృహాల్లో భద్రపర్చి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీకుమార్, గుమస్తా అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు సన్మానం

అనంతగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంగుపర్తి సెక్టార్‌లోని సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ గురువారం పదవీ విరమణ చేసిన దాసరి ఝాన్సీని గురువారం ఐసీడీఏస్ కార్యాలయం లో సన్మానించారు. ఈ సందర్భంగా లంగుపర్తి వైద్యాధికారి మంజుభార్గవి, ఎన్.సుగుణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఝాన్సీ ఎనలేని సేవలను అందించారని అన్నారు. అనంతరం ఝాన్సీ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలోని ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో గైనకాలజిస్టు కోసం లేఖ



కలెక్టర్‌కు రాసిన లేఖను చూపుతున్న టీడీపీ నేత పాండురంగస్వామి

పాడేరురూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని గర్భిణులకు ఆరోగ్య పరీక్షలకు వీలుగా ముంచంగిపుట్టు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్టును నియమించాలని కోరుతూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు లేఖ రాసినట్టు టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముంచంగిపుట్టు సీహెచ్‌సీ పరిధిలో18 సబ్‌సెంటర్లు, పెదబయలు పీహెచ్‌సీ పరిధిలో 19 సబ్‌సెంటర్లు ఉన్నాయని, పెదబయలులో పీహెచ్‌సీతో పాటు గోమంగి, రూడకోటలో పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. ఈ రెండు మండలాల పరిధిలోని 5 పీహెచ్‌సీలకు సంబంధించిన గర్భిణులు ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి వెళ్లి పరీక్షలు చేయించుకొనేవారన్నారు. కొంత కాలంగా అక్కడ గైనకాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలకు పాడేరు, అనకాపల్లి, విశాఖపట్నం, ఒడిశాలోని లమతాపుట్టు ఆస్పత్రులకు వెళ్లాల్సి న పరిస్థితి వస్తుందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో గైనకాలజిస్టును నియమించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.శశిభూషణ్ నా యుడు, పి.రామలింగం, ఎన్.ప్రసాద్, కర్ణ అచ్చిబాబు పాల్గొన్నారు.

నేడు ఆదివాసీ యువగళం, జీపుజాత ముగింపు

చింతపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ యువగళం, జీపుజాత ముగింపు కార్యక్రమాలను నిరుద్యోగులు విజయవంతం చేయాలని గిరిజన సంఘం మండల నాయకుడు సాగిన చిరంజీవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీలకు శతశాతం ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలని, ఆగస్టు 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జీపుజాత ప్రారంభించినట్టు చెప్పారు.

'పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకం'

ముంచంగిపుట్టు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుంగాపుట్టు, బరడ, కర్రిముఖిపుట్టు, వనగుమ్మ, దొడిపుట్టు, సుజనకోట గ్రామాల్లో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు ఆధ్వర్యంలోని గ్రామ కమిటీల ఎన్నిక జరిగింది.. పార్టీ బలోపేతానికి ఆయన పలు సూచనందించారు.

నిండుకుండలా మత్స్యగెడ్డ



ఆకట్టుకునే రీతిలో పెదబయలు ఏవోబీ వంతెన వద్ద గెడ్డపాయ

పెదబయలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏవోబీ సరిహద్దున మత్స్యగెడ్డ నీటి పాయలు ఆకట్టుకుంటున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మత్స్యగెడ్డ నిండుకుండలా దర్శనమిస్తోంది. ఈ దృశ్యాలను వీక్షించేందుకు సాయంత్రం వేళల్లో స్థానికులు ఏవోబీ వంతెన వద్దకు చేరుతున్నారు. సెల్ఫీల్లో బంధిస్తున్నారు. గురువారం సాయంత్రం మత్స్యగెడ్డ మధ్యలో జాలరులు నాటు పడవతో చేపలు పడుతున్న సమయంలో కనువిందు చేసిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇలా క్లిక్ మనిపించింది.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు



వంతాడపల్లిలో కరపత్రాలు అందిస్తున్న నాగరాజు

పాడేరురూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వంతాడపల్లి గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గత ఏడాదిలో అందించిన పథకాలను వివరించారు. గ్రామంలో సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాలో జమచేయనున్నారని, 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, వంతాడపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మినుముల గణపతి, మాజీ సర్పంచ్ బాలరాజు, 10వ క్లస్టర్ కో-ఆర్డినేటర్ రాజేశ్, గెమ్మెలి బాలన్న, తామర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పాడేరు సినిమాహాలు సెంటర్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి, యూనిట్ ఇన్‌చార్జి రమ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలు విక్రయం



జీకే వీధి వారపు సంతలో కూరగాయలు విక్రయిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

గూడెంకొత్తవీధి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతలో ఆదివాసీ రైతులు పండించిన ఆర్గానిక్ కూరగాయలను విక్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. ఏపీసీఎన్‌ఎఫ్ సహకారంతో మండలంలోని ఆదివాసీ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ పలు రకాల కూరగాయలను పండించారు. వీటిని ఏపీసీఎన్‌ఎఫ్, వెలుగు సిబ్బంది మార్కెట్‌లో విక్రయించారు. మైదాన ప్రాంతీయులు ఎగబడి కొనుగోలు చేశారు. రైతులకు అధిక ధర లభించింది. ఈకార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ ఎంటీ వెంకటరావు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



సబ్ జైలులో ఉన్న ఖైదీతో మాట్లాడుతున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి షియాజ్‌ఖాన్ గురువారం ఇక్కడి సబ్ జైలును తనిఖీ చేశారు. జైలు పరిసరాలు, వంటశాలను పరిశీలించడంతో పాటు ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేస్తున్నారా, భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. రిమాండ్ ఖైదీలుగా ఎన్ని నెలలుగా ఉంటున్నారని వారిని ప్రశ్నించారు. లాయర్‌ని పెట్టుకునే స్థోమత లేకపోతే న్యాయ సహాయం చేస్తామని వారికి వివరించారు. మండల న్యాయ సేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకుంటే ఉచితంగా న్యాయవాదిని పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌వీ శివప్రసాద్, జయప్రకాశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ



అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజల చేస్తున్న భక్తులు

కృష్ణాదేవిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం తెల్లవారుజాము ఐదు గంటలకు భూమి పూజ చేశారు. ఇక్కడి రాజరాజేశ్వరీ శివాలయం ప్రాంగణంలో ఆలయ అర్చకులు వెలిది భద్రాద్రి రాముడు మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుకను జరిపారు. ఈ ఆలయాన్ని నదీ ప్రవాహానికి సమీపంలో నిర్మిస్తుండడం వల్ల అయ్యప్ప మాలధరించిన భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చెక్కా సంతోష్, సంపత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వల్లంపేట, లింగంపేటల్లో పారిశుధ్య పనులు



వల్లంపేటలో పారిశుధ్య పనులు

నాతవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపేట,లింగంపేట గ్రామాలలో గురువారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కాలువల్లో పూడికను తొలగించి, బ్లీచింగ్ చల్లారు. అలాగే చెత్త కుప్పలను తొలగించి దూరప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణకళ్యాణ్, లింగంపేట సర్పంచ్ లోకవరపు రాము మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

బడికి పంపాలంటే భయం.. భయం..

- శిథిలావస్థకు చేరిన మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం, గొలుగొండ మండలం నాగందొరపాలెం పాఠశాలల భవనాలు
- గత వైసీపీ ప్రభుత్వం 'నాడు- నేడు' పేరుతో హడావుడి చేసినా చాలా చోట్ల మెరుగుపడని సౌకర్యాలు
- కూటమి సర్కారు దృష్టి సారించాలని వేడుకోలు

మాకవరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : 'నాడు-నేడు' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామని గత వైసీపీ పాలకు చెప్పిన మాటలకు, నేడు పలు బడుల్లో దుస్థితికి పొంతన లేకుండా ఉంది. మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం పాఠశాల, గొలుగొండ మండలం నాగందొరపాలెం పాఠశాలల భవనాలను చూస్తే ఇట్టే అర్థమైపోతుంది. మాకవరపాలెం మండలంలోని ఎరకన్నపాలెంలో గల పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ సుమారు 35 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో పిల్లలను చదువుకు పంపాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వర్షాలు కురిసినప్పుడు భవనం మరింత నాని ఉంటుందని, అటువంటప్పుడు జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. కూటమి సర్కారు వెంటనే స్పందించి శిథిల భవనానికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



ఎరకన్నపాలెం పాఠశాలలో వరండాలో చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు (ఇన్‌సెట్) శ్లాబ్ పెచ్చులూడిన దృశ్యం



శిథిలావస్థకు చేరిన గొలుగొండ మండలం నాగందొరపాలెం గ్రామంలోని పాఠశాల భవనం

నాగందొరపాలెంలో...

గొలుగొండ : మండలంలోని నాగందొరపాలెం ప్రాథమిక పాఠశాల భవనం భయపెడుతోంది. శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం భవనం శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. గత ఏడాది ఓ విద్యార్థిపై పెచ్చులు పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ మరమ్మతులు చేపట్టడంతో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించాల్సిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'బ్రిటీష్ సైనిక అధికారుల సమాధుల స్థలం కబ్జా'



సమాధుల స్థలాన్ని పరిశీలిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ నాయకులు

నర్సీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర్యం పోరాటంలో అల్లూరి సీతారామరాజు చేతిలో మృతి చెందిన బ్రిటీష్ సైనిక అధికారుల సమాధుల స్థలం కబ్జా చేస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్ ఆరోపించారు. గురువారం ఆయన ఇక్కడి మెయిన్ రోడ్డులో ఉన్న సమాధుల స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. అల్లూరి పోరాట పటిమకు గుర్తుగా ఉండే ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. కోర్టు ఆర్డర్ ఉందని మునిసిపల్ కమిషనర్ చెబుతున్నారని, దానిని చూపాలన్నారు.

రిజిస్ట్రేషన్లలో తప్పిదాలు ఉండరాదు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ రిజిస్ట్రార్‌లతో మాట్లాడుతున్న కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్‌లు నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను విధిగా చేరుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. జిల్లాలో గల సబ్ రిజిస్ట్రార్‌లతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే అయిన గ్రామాల్లో పలుచోట్ల ఒకరి పేరుమీద ఉన్న ఆస్తి వేరొకరి పేరిట నమోదైందని, వెంటనే వేరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం వంటి జరుగుతున్నాయని తరుచూ వినతులు అందుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్‌పీఎం ఆధారంగా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రతి డాక్యుమెంట్ విషయంలో లింక్, ఈసీ తప్పక చూసి పూర్వ యాజమాన్య హక్కులను రూఢీకరించుకోవాలని ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు, పది మంది సబ్ రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 84 మంది ఎంపిక

నర్సీపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంఎల్‌ఏఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 126 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఫార్మా, ఐటీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపి 84 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల చైర్మన్ మీసాల సుబ్బన్న తెలిపారు. ఎంపికైన వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ తాతబ్బాయి, ప్లేస్‌మెంట్ అఫీసర్ ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ క్ర్రి. శంకరరావుగురువారం తెలి పారు. దేవరాపల్లి, కాశీపురం, తెనుగుపూడి, అలాగే అనంతగిరి మండలంలోని నాలుగు పంచాయతీల వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టడీ మెటీరీయల్ వితరణ



దేవరాపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత వాలాబు పాఠశాలలో గిరిజన విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరీయల్, స్పోర్ట్స్ మెటీరీయల్, స్టేషనరీ గురువారం అందజేశారు. ఉపాధ్యాయుడు దండునాయుడు, పోడెల బుజ్జి, ట్రస్ట్ చైర్మన్ గొంప. వెంకటరావు, లెక్కల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

రావికమతం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):ఏ ఉద్యోగికైనా విధుల నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీపీ పైల రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కోమటి శంకరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కె. వెంకన్నబాబు పదవీ విరమణ సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీడీవో వెంకన్నబాబు దంపతులను ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సీతారామస్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు ప్రారంభించాలి: పీడీఎస్‌వో



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

చోడవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డిగ్రీకాలేజీల్లో ఆఫ్‌లైన్‌లో ప్రవేశాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు నందారపు భాస్కర్ మాట్లాడుతూ, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతితో పాటు, మేజర్, మైనర్, మల్టీఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానాలను రద్దు చేయాలని కోరారు. ప్రవేశాలు ఆలస్యం కావడంతో విద్యార్థుల్లో అయోమయం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో పాటు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలని, ప్రతి మండలంలో ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల మూసివేత కోసం తీసుకుని వచ్చిన జీవో 117ని రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న హాస్టల్ మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముందుగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు బి. కుమార్, బి. గణేశ్, మనోజ్, రామకృష్ణ, వరహాలనాయుడు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న డీఎల్‌డీఏ జిల్లా అధికారి సౌజన్య, తదితరులు

రోలుగుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచుగుమ్మలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని డీఎల్‌డీఏ జిల్లా అధికారి సౌజన్య, కోటవురట్ల ఏడీ నరేశ్ ప్రారంభించారు. అనంతరం స్థానిక వైద్యులు బాబూరావు పడాల్, సౌజన్య, సురేశ్‌లు సుమారు 34 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులను అందించారు. 22 సాధారణ పశువులకు పరీక్షలు నిర్వహించారు. 248 గొర్రెలు, మేకలకు బలవర్థక మందులను అందించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడిపోషణలో ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు శ్రీను, పశు వైద్య సిబ్బంది, ట్రైనీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం మండల సమావేశం రేపు

చోడవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశం ఆగస్టు 2వతేదీ శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాభిప్రాయం తర్వాతే భూ సేకరణ చేపట్టాలి

- మండల సమావేశంలో సభ్యులు డిమాండ్
- మొలకెత్తని విత్తనాలపై ధ్వజం



మండల సమావేశంలో వ్యవసాయాధికారిని నిలదీస్తున్న సభ్యులు

బుచ్చెయ్యపేట, జూలై 31 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో ప్రజాభిప్రాయం తీసుకున్నతర్వాతే పరిశ్రమలకు భూ సేకరణ చేపట్టాలని ప్రజా ప్రతినిధులు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30కు జరగాల్సిన సమావేశం 11.30కు ఎంపీపీ నాగేశ్వరి దేవి అధ్యక్షతన ప్రారంభమైంది. ముందుగా పీహెచ్‌సీల వైద్యాధికారులు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు వివరించారు. భీమవరంలో ఎక్కువ మంది కిడ్నీ వ్యాధికి లోనవుతున్నారని గ్రామ నాయకుడు బల్లిన అమ్మునాయుడు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ చెరువుల ఆక్రమణలు తొలగించాలని కోరారు. కొండపాలెం, భీమవరం గ్రామాల్లో పలువురు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్న నేపథ్యంలో ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసి వ్యాధి ప్రబలడానికి గల కారణాలను గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతనే పరిశ్రమలకు భూ సేకరణ చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ రహదారుల కిరువైపులా చెట్ల నరికివేతకు గురువుతున్నాయన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలు బస్సులు కాలం చెల్లిన వాటిని వినియోగించకుండా చూడాలన్నారు. వడ్డాది ఎన్‌టీఎస్ స్కూల్‌కి ఎదురుగా మద్యం షాపు లేకుండా చూడాలని పలువురు కోరారు. అలాగే, వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండంలో వర్షపాతం 36 శాతం నమోదైనా ఇప్పటి వరకు వరి నాట్లు పడలేదన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు కల్పించుకుని వరి విత్తనాలు నాణ్యమైనవి అందించపోవడంతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కొన్నిచోట్ల విత్తనం మొలకెత్తలేదన్నారు. వడ్డాదిలో ఓ దుకాణంలో కొనుగోలు చేసిన విత్తనాలు నాటలేదని, ఆ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్వారా ఎరువుల కొరత లేకుండా చూడాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత ఏ ఈ సమావేశానికి హాజరుకావడంలేదన్నారు. దీంతో ఎవరికి సమస్య చెప్పాలని ప్రశ్నించారు. తహశీల్దార్ ఎం. లక్ష్మి మాట్లాడుతూ, గ్రామాల్లో శిస్తు వసూలకు సర్పంచ్‌లు సహకరించాలని కోరారు. పరిశ్రమలకు మండలంలో 900 ఎకరాలు సేకరించనున్నట్టు చెప్పారు. ఈ విషయంలో ఎవరినీ బలవంతం చేయమన్నారు. మల్లాం భీమవరం, ఆర్. శివరాంపురం సర్పంచ్‌లు బర్ల శివ, నమ్మి అప్పలరాజు, అమ్మునాయుడు మాట్లాడుతూ పరిశ్రమలకు భూములు ఇచ్చేదిలేది స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానోజీరావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దిమిడిలో పౌర హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బిడి గ్రామంలో తహశీల్దార్ లక్ష్మి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతు గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలు కలసిమెలిసి ఉండాలన్నారు. దళిత, మైనార్టి వర్గాలపై వివక్షత చూపరాదన్నారు. ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితవాడలో డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని స్థానికులు ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొన్నాబత్తుల శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రవీణ్, ఆర్‌ఓ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు..

133 వితంతు పింఛన్లు మంజూరు

చీడికాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 13 సచివాలయాల పరిధిలో కొత్తగా 133 వితంతు పింఛన్‌లు మంజూరైనట్టు స్థానిక ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. వీటిలో 55 మంది లబ్ధిదారులకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా శనివారం ఉదయం పింఛన్లను అం దించనున్నారని ఆయన తెలిపారు. అప్పలరాజుపురం సచివాలయ పరిధిలో 11, అర్జునగిరి 12, బైలపూడి 10, చీడికాడ 11, చుక్కపల్లి ఆరు, దిబ్బపాలెం ఆరు, జి.కొత్తపల్లి 12, జేబీ పురం 13, జైతవరం 9, ఖండివరం 8, కోనాం 12, శిరిజాం 10, తురువోలు 13 పింఛన్లు కేటాయించినట్టు చెప్పారు.

మట్టి గణపతి విగ్రహం పోస్టర్ల ఆవిష్కరణ



ఉత్సవాలకు సంబంధిచి మట్టి గణపతి విగ్రహం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చోడవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానికహార్డింజి అతిథిగృహంలో సద్భావన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహంనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. స్థానిక విఘ్నేశ్వ రాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొప్పాక రాజేశ్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని విధంగా ఈ ఏడాది 63 అడుగుల భారీ మట్టి గణపతిని ప్రతిష్ఠించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఉత్సవాల్లో 20 రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఆలయ చైర్మన్ పసుమర్తి సాంబమూర్తి, పసుమర్తి శ్రీనివాస్, చేకూరి రాజు, ఉపాధ్యాయుల శ్రీనివాస్, కోరుకొండ సత్తిబాబు పాల్గొన్నారు.

3న ఉచిత వైద్య శిబిరం

కె.కోటపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సంఘ మిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆగస్టు 3వతేదీన మండలంలోని దాలివలసలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వైద్యానికి సంబంధించి విశాఖ కేజీహెచ్ ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ బండారు రామచంద్రరావు ఈ శిబిరంలో పాల్గొంటారని అన్నారు. అలాగే, ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.


రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం



శర్మ మాస్టర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రోలుగుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉపాధ్యాయుడు శర్మ అంకిత భావంతో పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని స్థానిక ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన స్కూల్ అసిస్టెంట్ రాచకొండ వెంకట సత్యరాజారావు శర్మ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఘనంగా సన్మాన సభను నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం శర్మ మాస్టారు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు పోతల లక్ష్మీరమణమ్మ, ఏంఈఓ జాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పాడి రైతులకు చేయూత



పాడి రైతులకు దాణాబేసిన్లు పంపిణీ చేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ పవన్‌కుమార్

చోడవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతంలో పాడిరైతులకు విశాఖ డెయిరీ అండగా ఉంటుందని డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఖండేపల్లి, అన్నవరం గ్రామాల్లోని పాలసంఘాల పరిధిలో సుఖీభవ కార్డు కలిగిన 522 మంది పాడి రైతులకు విశాఖ డెయిరీ తరపున దాణా బేసిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ, డెయిరీ అందిస్తున్న సహాయ సహకారాలతో పాడి రైతులు మరింతగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ యూనిట్ మేనేజర్ రాము, పాల సంఘాల అధ్యక్షులు వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

166 ఎకరాల ఉప్పు మడులు ఏపీఐఐసీకి బదలాయింపు

లీజు సొమ్ము చెల్లించకపోవడంతో 2015లోనే లీజులు రద్దు

- తాజాగా ఏపీఐఐసీకి అప్పగిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- తమకు లీజుకు ఇవ్వమని అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోలేదని మత్స్యకారుల ఆవేదన

అచ్యుతాపురం జూలై 31 (ఆంధ్రజ్యోతి):

పూడిమడక సముద్ర తీరంలోని 166 ఎకరాల్లో గల ఉప్పు మడులు ఇప్పుడు ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్నాయి. ఈ మడులకు లీజుదారులు సకాలంలో లీజు సొమ్ము చెల్లించకపోవడంతో 2015లోనే లీజులను ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా ఈ మడులను ఏపీఐఐసీకి బదలాయించింది. ఇక్కడ ప్రస్తుతం ఎస్సీ, బీసీ సంక్షేమ సంఘాలకు కేటాయించిన ఉప్పు మడులు మాత్రమే కొనసాగుతున్నాయి.

పూడిమడక సర్వే నంబరు 113లో 45.48, సర్వే నంబరు 139లో 120.67 వెరసి 166.15 ఎకరాలు ప్రభుత్వానికి చెందిన భూమి ఉంది. ఈ భూముల్లో చెట్లు, తుప్పలు పెరిగిపోయి వుండేవి. అయితే 1955లో అనకాపల్లికి చెందిన కొందరు వ్యాపారులు ఇక్కడ ఉప్పు పండించాలని నిర్ణయించి, ప్రభుత్వానికి అర్జీ పెట్టారు. దీంతో ప్రభుత్వం ఎకరాకి సంవత్సరానికి వెయ్యి రూపాయలు చొప్పున లీజు ఒప్పందం చేసుకుంది. దీంతో కన్యకాపరమేశ్వరి సాల్ట్ కర్మాగారానికి 106 ఎకరాలు, అంబికా సాల్ట్ కర్మాగారానికి 60 ఎకరాలు కేటాయించింది. దీంతో వీరు ఈ భూములను ఉప్పు మడులుగా చేసి సముద్రం నుంచి నేరుగా ఉప్పుమడులకు సముద్రపు నీరందేలా కాలువను కూడా ఏర్పాటు చేసుకొని ఉప్పుపంట ప్రారంభించారు.

లీజు ఎగవేయడంతో నిలిచిపోయిన ఉత్పత్తి

లీజుదారులు 2003 వరకు సక్రమంగానే లీజు సొమ్ము చెల్లించేవారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి చెల్లింపులు నిలిపివేశారు. అనకాపల్లికి చెందిన ప్రముఖ నాయకుడి బంధువులకు ఇక్కడ ఉప్పు మడులు ఉండేవి. వీళ్లు లీజు సొమ్ము చెల్లించకపోవడంతో మిగతా వారు చెల్లించడం మానేశారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు కూడా వదిలేశారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత



ఉప్పు మడుల్లోంచి కల్లానికి ఉప్పు తీసుకువెళుతున్న మత్స్యకార మహిళలు (ఫైల్ ఫొటో)

దీనిపై దృష్టి పెట్టింది. ప్రభుత్వానికి చెందిన భూములు ఆక్రమించే వారు శిక్షార్హులంటూ రెవెన్యూ అధికారులు అప్పట్లో బోర్డులు పెట్టారు. దీంతో ఉప్పు మడులు లీజుకు తీసుకున్న యజమానులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో 2015 మార్చి నుంచి ఉప్పుపంటను నిలిపివేశారు. దీంతో ఏటా పదివేల టన్నుల ఉప్పును ఉత్పత్తి చేసే మడులు మూతపడ్డాయి. అయితే



ప్రస్తుతం ఉప్పు మడుల పరిస్థితి

వీటిని తమకు లీజుకు ఇవ్వాలని అప్పటి నుంచి మత్స్యకారులు అధికారులకు అర్జీలు పెడుతున్నారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు.

ఉపాధి కోల్పోయిన కూలీలు

ఉప్పు మడుల వలన ప్రత్యక్షంగా వందల సంఖ్యలో, పరోక్షంగా వేల సంఖ్యలో కూలీలకు ఉపాధి దొరికేది. ప్రతి సంవత్సరం డిసెంబరు మొదటి వారంలో ఇక్కడ ఉప్పు మడుల్లో పనులు ప్రారంభమయ్యేవి. వర్షాకాలంలో ఉప్పు మడుల్లో వర్షపు నీరు నిలిచిపోయి నాచుపట్టేది. ఆ నాచును తొలగించి తరువాత సముద్రపు ఇసుకను మడుల్లో వేసి మహిళలతో తొక్కించిన అనంతరం సముద్రపు నీటిని మడుల్లోకి పంపి ఉప్పు పండించడం ప్రారంభించేవారు. ఆ తరువాత పండిన ఉప్పును మడుల్లోంచి కల్లాల్లోకి చేర్చడం, అనంతరం లారీల్లోకి ఎక్కించి ఎగుమతి చేసేవరకు కూలీలు అవసరం వుండేది. దీనికి ఎక్కువగా మత్స్యకారులను వినియోగించేవారు. ఉప్పు మడుల్లో ఇసుకను తొక్కడంతో పాటు పండిన ఉప్పును మడుల్లోంచి కల్లానికి చేర్చడానికి ఎక్కువగా మత్స్యకార మహిళలను వినియోగించేవారు. అలాగే పండిన ఉప్పును మడుల్లోంచి తీసి గట్టుమీద వేయడానికి, తరువాత లారీల్లో లోడ్ చేయడానికి దళితులతో పాటు పల్లీ (అగ్నికుల క్షత్రియ)లకు చెందిన పురుషులను కూలీలుగా చేర్చుకొనేవారు. అలాగే మత్స్యకార మహిళలు తాము చేసిన పనికి కూలి తీసుకోకుండా దానికి సరిపడా ఉప్పును తీసుకొని గ్రామాల్లో విక్రయించేవారు. దీంతో వీరు ఆదాయం సంపాదించేవారు. ప్రసుత్తం వీరు ఏ పని లేక కార్మాగారాల్లో కూలి పనికి వెళుతున్నారు. మత్స్యకారులకే ఉప్పు మడులను కేటాయిస్తే ఉప్పు పండించుకుని ఆదాయం పొందేవారు. అయితే ఈ భూములను ఏపీఐఐసీకి కేటాయించడంతో ఆవేదన చెందుతున్నారు. ఉప్పు మడులు ఉన్న భూములు పూడిమడక గ్రామాన్ని ఆనుకొని ఉన్నాయి. ఈ భూములను ఏపీఐఐసీకి బదలాయించడంతో భవిష్యత్తులో ఇక్కడ కర్మాగారాలు నిర్మిస్తే తమ పరిస్థితి ఏమిటని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో సెజ్‌లో నిర్వాసితులైన అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు చెందిన 24 గ్రామాల రైతులకు పునరావాసం కల్పించారు. కానీ పూడిమడక మత్స్యకారులకు పునరావాసం కల్పించడం కుదరదు. ఎందుకంటే వీరికి చేపల వేట తప్ప ఇతర పనులు రావు. అందువల్ల ప్రభుత్వం ఆలోచించి తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌తో ముప్పు

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. పర్యావరణ రక్షణకు కీలకంగా ఉండాల్సిన ఈఐఏ నివేదిక.. ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసినట్టుగా ఉందని విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేయడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు వద్దు

ఎం.అప్పలరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌ను నక్కపల్లి ప్రాంత ప్రజలు కోరుకోవడం లేదు. ఈ నెల 6న నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సభను రద్దు చేయాలి.

పండుగలా అన్నదాత సుఖీభవ

... 5వ పేజీ తరువాయి

చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం ప్రభుత్వం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ పథకానికి జిల్లాలో ఇంతవరకు 2,31,688 మంది రైతులను అర్హులుగా గుర్తించాన్నారు.

సింహగిరిపై పెళ్లిళ్లకు రూ.10 వేలు చార్జి

... 5వ పేజీ తరువాయి

అనుమతిస్తారు. వివాహం తరువాత మూడు గంటలలోపు అందుకు వాడిన కుర్చీలు, మండపాలు, సోఫాలు, తదితరాలను అక్కడ నుంచి ఖాళీ చేయాలి. వివాహం చేసుకోదలచిన వారి నుంచి పారిశుధ్యం నిమిత్తం రూ.2 వేలు, అడ్వాన్స్ రూపంలో రూ.5 వేలు వసూలు చేసి పెళ్లి అనంతరం తిరిగి ఇచ్చే విధంగా పీఆర్‌ఓ కార్యాలయంలో సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు.

సముద్రపు నాచు సాగుతో ఆర్థికాభివృద్ధి

- జిల్లా మత్స్యశాఖ అధికారిణి విజయ

అచ్యుతాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):సముద్రపు నాచు పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా మత్స్యశాఖాధికారిణి జి.విజయ తెలిపారు. గురువారం ఆమె తంతడి శివారు వాడపాలెం తీరంలో నాచు పెంపకం గురించి మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సముద్రపు నాచుకు బాగా డిమాండ్ ఉందన్నారు. ఈ నాచును వివిధ మందులతో పాటు పిల్లలకు, పెద్దలకు పోషకాహారంగా కూడా వినియోగించవచ్చన్నారు. దీనికి సంబంధించిన విత్తనాలను మత్స్యశాఖ సరఫరా చేస్తుందని, అలాగే మార్కెటింగ్ కూడా మత్స్యశాఖే చూస్తుందన్నారు. సముద్రపు అలలు లేని ప్రాంతంలో దీనిని పెంచవచ్చని, తొలిసారి 90 రోజులకు క్రాప్ వస్తుందని, తరువాత ప్రతి 45 రోజులకు క్రాప్ వస్తుందన్నారు. ఒక సారి రూ.10 వేలు పెట్టుబడి పెడితే నాలుగు సంవత్సరాలు పంటద్వారా ఆదాయం వస్తుందన్నారు. అందువల్ల డ్వాక్రా సంఘాల ద్వారా ఈ నాచు పెంపకాన్ని చేపట్టాలని యోచిస్తున్నామన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా సోంపేటలో నాచు పెంపకం



వాడపాలెం తీరం వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జరుగుతోందని, వీరికి అక్కడ 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఇక్కడ నాచు సాగు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, మండల మత్స్యశాఖ అధికారి రవితేజ, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ చోడిపల్లి మురళి, వంకా కృష్ణ, చోడిపల్లి దేముడు, కె.పద్మావతితో పాటు డ్వాక్రా మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో పక్కాగా మెనూ అమలు

- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో భోజన మెనూ పక్కాగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో శతశాతం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రవేశాలు కల్పించాలన్నారు. సాంఘిక సంక్షేమ, రెసిడెన్సియల్ పాఠశాలలు, కాలేజీలు, మోడల్ స్కూల్స్‌లోనూ శత శాతం సీట్ల భర్తీ చేయాలని సూచించారు. విద్యార్థులుండే గదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎటువంటి చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖ వివిధ విభాగాల అధికారులు మాణిక్యం, సత్యసునీల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమాధుల స్థలం కబ్జాపై రగడ

... 5వ పేజీ తరువాయి

పంపించి తొలగించామని చెప్పారు. దుకాణాలు నిర్మించుకుంటున్న ఐదుగురు వ్యక్తులు గత సోమవారం మధ్యాహ్నం హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారని, వాటి జోలికి వెళ్లవద్దని కోర్టు ఆదేశించిందని తెలిపారు. షాపుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేదని ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా కోర్టుకు తెలియజేశామని అన్నారు. న్యాయస్థానం నుంచి తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 24వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, మెయిన్ రోడ్డును వంద అడుగులకు విస్తరిస్తామని చెప్పి గత ప్రభుత్వం షాపులు పడగొట్టి పేదల పొట్టకొట్టిందని విమర్శించారు. అక్కడ 19 సెంట్లు స్థలంలో ఎటువంటి నిర్మాణాలు జరగడం లేదని, 2010లో రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ చేశారని మ్యాప్ చూపించారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, సమాధుల కోసం కేటాయించిన స్థలం 46 సెంట్లు అని, ఆక్రమణలు పోగా మధ్యలో 19 సెంట్ల స్థలం చూపించారని తెలిపారు. మరో వైస్‌చైర్మన్ తమరాన నాయుడు మాట్లాడుతూ, ప్లాన్ అనుమతులు లేకుండా అక్కడ షాపులు నిర్మిస్తున్నారని ఆరోపించారు.

పాఠశాల క్రీడా స్థలం కబ్జా

... 5వ పేజీ తరువాయి

చేపట్టాలని అధికారులు భావించారు. ఈలోగా ప్రభుత్వం మారిపోయి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల భవన నిర్మాణం అటకెక్కింది. తరువాత 2022లో ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని ప్రభుత్వం భావించగా, కొంతమంది స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టేఆర్డర్ తీసుకువచ్చారు. అప్పటి నుంచి యథాతథస్థితి కొనసాగుతున్నది.

అయితే తాజాగా కొంతమంది అక్రమార్కుల కన్ను ఈ స్థలంపై పడింది. యంత్రాలతో స్థలాన్ని చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. ముగ్గురు వ్యక్తులు ఐదేసి సెంట్ల చొప్పున ఆక్రమించి పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరో ముగ్గురు వ్యక్తులు సుమారు 15 సెంట్లు ఆక్రమించారు. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే.. తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన స్థలం అంటూ ఏవో కాగితాలు చూపిస్తున్నారు. దీంతో మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు స్పందనలేదు. రెవెన్యూ సిబ్బంది ఇటువైపు కన్నెత్తి అయినా చూడడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి, మామిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు కేటాయించిన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదులు చేసినా స్పందించ లేదు

పూడి పరదేశినాయుడు, సర్పంచ్, మామిడిపాలెం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్రీడా మైదానం కోసం సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఐదు ఎకరాలు కేటాయించింది. ఇటీవల కొంతమంది ఈ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. దీనిపై మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాం. కానీ ఒక్కరు కూడా స్పందించలేదు.

ఉత్తరాంధ్ర అంటే ఎంతో ఇష్టం

... 5వ పేజీ తరువాయి

సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్రస్థాయి కమిటీలు వేసేందుకు అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌తో త్వరలో చర్చించి నిర్ణయిస్తామని చెప్పారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడేరుకు చెందిన గిరిజన వీరమహిళ పద్మ.. తన భర్త ఆరోగ్య పరిస్థితి బాలేదని చెప్పగా.. నాగబాబు వెంటనే స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. మెరుగైన వైద్యం అందించేందుకు మరింత సాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నాగబాబుకు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. ఈ సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లాకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం సందర్శన

అనకాపల్లి రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయాన్ని నాగబాబు గురువారం ఉదయం సందర్శించారు. తొలుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందించి పట్టువస్త్రాలతో సత్కరించారు. ఆయన వెంట అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), కూటమి నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్, భీశెట్టి సుధ, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి తదితరులు ఉన్నారు.

క్రైం... crime news

ఆనందపురంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కె.కోటపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపురం చెరువు బంద వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు ఎ.కోడూరు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సాయి బాలాజీ వాటర్ ప్లాంట్ వెనుక వైపు ఉన్న వేచలపు చెరువు బందలో ఓ వ్యక్తి మృతదేహం వున్నట్టు స్థానికులు సమాచారం ఇచ్చారని చెప్పారు. పోలీసు సిబ్బంది వెళ్లి పరిశీలించారని, మృతుడి వయసు 45-50 ఏళ్ల వుంటాయని, సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడని, ఎరుపు, తెలుపు గడులుతో టీ షర్ట్, నీలం రంగు లుంగి ధరించి వున్నాడని ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో స్పందించాలని ఎస్‌ఐ చెప్పారు.

ప్రేమ పేరుతో యువతులకు గాలం

- ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు డిమాండ్
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- అనకాపల్లి జిల్లాకు చెందిన నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతులకు గాలం వేసి వారికి దగ్గరవుతాడు. ఆ తరువాత వారితో చనువుగా ఉన్న సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి వాటిని సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు గుంజడాన్ని హాబీగా మార్చుకున్న నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన సరమండ శ్రీనుకు నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వీరు సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియోలు, ఫొటోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని యువతిని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. అయితే యువకుడి వేధింపులు తాళలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో సీపీ ఆదేశాల మేరకు గోపాలపట్నం సీఐ ఆధ్వర్యంలోని బృందం గురువారం నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించింది. కాగా గతంలో ఇదే తరహాలో ఓ యువతిపై వేధింపులకు పాల్పడిన ఘటనలో నిందితుడిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్టు పోలీసులు తెలిపారు.

ప్రో కబడ్డీకి వేదికగా విశాఖ

- ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 11 వరకూ నిర్వహణ

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్‌కు (పీకేఎల్) విశాఖ ఆతిథ్యమివ్వనున్నది. సీజన్-12 సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను పీకేఎల్ యాజమాన్యం గురువారం ప్రకటించారు. ఆగస్టు 29 నుంచి అక్టోబరు 23 వరకు జరగనున్న మెగా టోర్నీలో 108 మ్యాచ్‌లకు జైపూర్, చెన్నై, ఢిల్లీతోపాటు విశాఖలోని పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని వేదికగా ఖరారు చేసింది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 11 వరకు జరగనున్న 28 మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా నిలవనున్నది. ఈ మ్యాచ్‌లలో హోమ్ టీమ్ తెలుగు టైటాన్స్‌తోపాటు బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబాంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, యు ముంబా, యూపీ యోధా...మొత్తం 12 జట్లు తలపడనున్నాయి.

ఎలమంచిలిలో దాహం కేకలు

... 5వ పేజీ తరువాయి

సుమారు 17 కిలోమీటర్ల మేర పైపులైన్ వుంది. దీని ద్వారా వచ్చిన నీరు యర్రవరం వద్ద వున్న భారీ సంప్‌లోకి చేరుతుంది. ఇక్కడ నాలుగు మోటార్ల ద్వారా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వున్న ట్యాంకులకు, వాటి నుంచి కొళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంది. అయితే సంప్ వద్ద వున్న మోటార్లలో ఒకటి సోమవారం మొరాయించింది. మిగిలిన మూడు మోటార్ల ద్వారా ట్యాంకులకు నీటిని పంపింగ్‌చేశారు. కానీప్రధాన పైప్‌లైన్ ద్వారా పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. పోతిరెడ్డిపాలెం సమీపంలో కొంతమంది రైతులు ప్రధాన పైపులైన్ బూస్టర్ వాల్వును ఓపెన్ చేసి, పొలాలకు నీటిని మళ్లించుకుంటున్నట్టు గుర్తించారు. ఆయా రైతులను హెచ్చరించి, నీటి సరఫరాను చక్కదిద్దారు. అయినప్పటికీ యర్రవరం సంప్‌లోకి పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో మిలట్రీ కాలనీ, కొత్తపేట, గాంధీనగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, క్లబ్‌రోడ్డు, ధర్మవరం, కాకివాని వీధి తదితర ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం నాటికి తాగునీటి సమస్య మరింత తీవ్రం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం మునిసిపల్ అధికారులు రంగంలోకి దిగి, పైప్‌లైన్‌ను తనిఖీ చేసుకుంటూ వెళ్లారు. యర్రవరం సమీపంలోని పోలిమేరమ్మ తల్లి ఆలయం వద్ద ఒక ఇంటి నిర్మాణ పనుల కారణంగా తాగునీటి పైపులైను పగిలిపోయినట్టు గుర్తించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఈ విషయం చెప్పగా.. కాంట్రాక్టర్‌ను పంపించారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఏఈ గణపతి సుబ్బారావు పర్యవేక్షణలో పైపులైన్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. అక్కడ నెలకొన్న పరిస్థితినిబట్టి శుక్రవారం కూడా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అయ్యే సూచనలు కనిపించడంలేదు.

పయనీర్ లారీలకు భారీ జరిమానా

... 5వ పేజీ తరువాయి

వస్తున్న లారీలను గమనించి అడ్డుకున్న విషయం విదితమే. ఇవి రాచపల్లిలోని పయనీర్ కంపెనీకి ముడిసరకు రవాణా చేస్తున్నట్టు వే బిల్లుల ద్వారా గుర్తించారు. విషయం తెలిసి పోలీసులు, పలు శాఖల అధికారులు అక్కడకు చేరుకున్నారు. అధిక లోడుతో వస్తున్న టిప్పర్ల కారణంగా తాళ్లపాలెం వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని స్పీకర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు ఆయా లారీలను స్వాధీనం చేసుకొని, జరిమానాలు విధించడానికి రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. నరీపట్నం ఎంవీఐ వీటిని తనిఖీ చేసి, పరిమితికి మించి సరకును రవాణా చేస్తున్నందుకు ఏడు లారీలకు రూ.3,92,000 జరిమానా విధించారు.

కారిడార్ నిర్వాసితులకు ప్యాకేజీ

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, నిర్వాసితులకు ఇంటి నిర్మాణానికి ఇచ్చే ప్యాకేజీని పెంచే విధంగా హోం మంత్రి అనిత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని, ఈ విషయం ఇప్పటికే ఆమె పరిశీలనలో వుందని చెప్పారు. ఆర్డీఓ రమణ మాట్లాడుతూ, పెదబోదిగల్లంలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలు



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, వైసీపీ, సీపీఎం నాయకులు

కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాసితులు, నాయకుల సమక్షంలో 745 మందికి సంబంధించి ప్లాట్ల కేటాయింపునకు లాటరీ తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరిసింహమూర్తి, డీటీ నారాయణరావు, ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు, కనకారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464